క్లుప్తంగా

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



తెనాలిరూరల్: ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న ప్రత్యేక లోక్అదాలత్లో మోటారు వాహన చట్ట కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి న్యాయవాదులకు సూచించారు. న్యాయవాదులతో తన చాంబర్లో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. మోటారు వాహన చట్టంలో సుప్రీంకోర్టు చేసిన సవరణల గురించి వివరించారు. సివిల్ అప్పీల్ 9322/2022 కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు రోడ్డు ప్రమాద బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం త్వరితగతిన అందేలా, కేసులు సత్వర పరిష్కారినికి దోహపడుతోందని తెలిపారు. ప్రత్యేక అదాలత్లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహాత్మ ఆశ్రమానికి రూ.50,116 విరాళం

తెనాలిటౌన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను అమలుపరుస్తూ వృద్ధులకు నిత్యం అన్నప్రసాద వితరణ ఆశ్రమంలో నిర్వహించడం విశ్వశాంతికి దోహదపడుతుందని 35వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయి హరేరామ్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ శాంతి సేవా ఆశ్రమంలో శుక్రవారం హరేరామ్ పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఆశ్రమ నిర్వహణకు హరేరామ్ రూ.50,116 చెక్కును నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారికి అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హరేరామ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై శిక్షణ

తెనాలి: ఓటరు జాబితాలపై స్పెషల్ సమ్మర్ రివిజను పక్కాగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శుక్రవారం ఉదయం నుంచి బీఎల్ఓలకు శిక్షణ నిర్వహించారు. తెనాలి సబ్కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్వోలు అందరూ ఇంటింటి సర్వేలు చేయాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రెజంటేషన్తో వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహసీల్దార్ ఎస్.హేనాప్రియ, పొన్నూరు తహసీల్దారు కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాస్తారోకో

తెనాలిరూరల్: విద్యా సమస్యల పరిష్కారం కోరు తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక బస్టాండ్ వంతెనవద్ద ఉదయం రాస్తారోకో చేపట్టారు. ప్రధా న రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ మార్గంలో పలు వాహనాలు నిలిచిపోయాయి. త్రీ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ తెనాలిలో పదో తరగతి పూర్తిచేసి పాలిటెక్నిక్ చదువుకోవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు అవసరమైతే బంద్ చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం ఇన్ఛార్జి మద్దినేని కిరణ్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బిల్లా రాజేష్, సహాయ కార్యదర్శి కుంభ రవితేజ, చెన్నూరి సాయి, తలతోటి శ్రీను, కోలా శేఖర్, కళ్యాణ్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్-2024పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్-2024లో సీటు సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతున్న విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తూ ఉచిత అవగాహన కల్పిస్తున్నట్లు హైదరాబాద్కు చెందిన మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ ద్వారా గైడెన్స్, ఇతర సమాచారానికి 8522958575, 7032264910 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పెదపర్రు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

పెదపర్రు(కొల్లిపర): పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని పెదపర్రు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని సురక్ష కార్యక్రమంలో గ్రామ సచివాలయంలో ఆధార్కు ఫోన్ నంబర్ లింక్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సీసీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 150 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులను గుర్తించి పథకాలు అందించడంతోపాటు సచివాలయాల పరిధిలో కుల, ఆదాయ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డులు అందజేయడం, భూముల మ్యూటేషన్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పెదపర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వివిధ సంక్షేమం పథకాలు ద్వారా రూ.7.77,72,960 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయటం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికి మాత్రమే పథకాలు అందేవని, నేడు అర్హత ప్రామాణికంగా పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామంలో ప్రజలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, వికలాంగులకు పింఛన్ వంటివి కావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సచివాలయంలో ఆన్లైన్లో నమోదు చేసుకుంటే తప్పకుండా వారికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సంజీవరెడ్డి, సర్పంచ్లు దూరు రత్నబాబు, బొల్లు కరుణశ్రీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మా సుజాత, ఇన్చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ శంకరరావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో శిరిపురం-తెనాలి రోడ్డు అభివృద్ధి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



శిరిపురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

శిరిపురం(కొల్లిపర): త్వరలోనే శిరిపురం నుంచి తెనాలి వెళ్లే ప్రధాన రహదారిని రూ.20కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మండలంలోని శిరిపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్లెట్లను అందజేశారు. శివకుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ సీఎం జగన్ వారికి అండగా ఉంటున్నారన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా 350గృహాలు కలిగి 750 మంది ఓటర్లు ఉన్న శిరిపురం గ్రామంలో లబ్ధిదారులకు నేరుగా రూ.7.75కోట్ల జమ చేసినట్లు తెలిపారు. 350గృహాలు ఉన్న గ్రామంలో 151మంది కుటుంబాలకు పింఛన్, ఇళ్లస్థలాలు 50 మందికి ఇచ్చినట్లు తెలిపారు. 75ఏళ్ల చరిత్రలో కనివిని ఎరగని విధంగా సీఎం జగన్న ఆశీసులతో నియోజకవర్గంలో 27వేల నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగిందన్నారు. శిరిపురం గ్రామానికి దగ్గరలో తెనాలి టౌన్ను తలపించేలా జగనన్న లేఅవుట్ను ఏర్పాటు చేసి దానిలో సుమారు 10వేల మందికి గృహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాబోవు రోజులలో రాష్ట్రంలోనే జగనన్న లేఅవుట్లో పెద్ద లేఅవుట్గా ముద్ర వేసుకుంటుందన్నారు. దీని ద్వారా రానున్న రోజులలో శిరిపురం గొప్పగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏడుగురు ఇళ్ల స్థలాలు కావాలని, గ్రామంలో కాల్వ, శ్మశాన వాటికలో రెండు విద్యుత్ స్తంభాలు కావాలని తెలిపారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే ఇళ్ల స్థలం కోసం అర్జీ ఇచ్చిన వారికి నిజంగా అర్హత ఉంటే త్వరలోనే జగనన్న కాలనీల్లో ఇవ్వటం జరుగుతుందన్నారు. 15రోజులలో మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత ఎమ్మెల్యే శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సంజీవరెడ్డి, సర్పంచ్ పచ్చవ సులోచనారాణి, మాజీ ఎంపీటీసీ పచ్చవ రమేష్, బొంతు వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ కారుమంచి పృథ్వికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు దేశబోయిన నాగపున్నేశ్వరరావు, శ్రీనివాసరావు, అవుతు పోతిరెడ్డి, అవుతు నగేష్రెడ్డి, పోపూరి రత్తయ్య, మొవ్వా జగన్మోహన్రావు, పచ్చవ రామోహ్మన్రావు, ధర్మారావు, అత్తోట పేత్రి, అత్తోట జయపాల్, మట్లపూడి శ్రీను, ఉయ్యూరు ఉమమహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూటికాడ తొలగించాలి

తెనాలిటౌన్: ఇరిగేషన్ అధికారుల మొండివైఖరి నశించాలి, పంట కాల్వల్లో గుర్రపు డెక్క, తూటాకు వెంటనే తొలగించాలని కోరుతూ శుక్రవారం జలవనరులశాఖ (ఇరిగేషన్) ఈఈ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు. జూలై రెండో వారం వచ్చిన తర్వాత పంట కాల్వలు మరమ్మతులకు టెండర్లు పిలవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మండిపడ్డారు. అధికారుల బాధ్యతారాహిత్యంవల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు పరిహారం, ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితానగర్ రైతు సంఘం అధ్యక్షులు అదరపు పూర్ణచంద్ మాట్లాడుతూ గుర్రపు డెక్క తొలగించే ప్రయత్నాన్ని ఇరిగేషన్ అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.మల్లికార్జున్కు రైతు నేతలు వినతిపత్రం అందజేశారు. మంగళవారంలోపు గుర్రపు డెక్క తొలగిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు, తేలప్రోలు మాజీసర్పంచ్ వేజెండ్ల రోశయ్య, ఈదర శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణయ్య, టి.రవిచంద్, ఇ.బుచ్చిబాబు, ఎ.హరిశంకర్, యలవర్తి సూర్యకుమార్, ఈదర ధనుంజయ్ పాల్గొన్నారు.

హెటెరో డ్రగ్స్కు 62 మంది ఏఎస్ఎన్ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఐటీ రంగంతోపాటు మార్కెటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, టీచింగ్ రంగాల్లోనూ ఉద్యోగాలను సాధిస్తున్న స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు తాజాగా ప్రముఖ ఫార్మా కంపెనీ హెటెరో డ్రగ్స్కు ఏకంగా 62 మంది ఎంపికైనట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కాలేజిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలియజేశారు. హెటెరో డ్రగ్స్ ఇటీవల జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులను మాత్రమే ఉద్యోగాల్లోకి తీసుకున్నట్టు చెప్పారు. ఫార్మా రంగంలో గల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తగిన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దిన కారణంగానే 62 మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. ఈ ఏడాది కూడా తమ విద్యార్థులు 1800 మందికిపైగా ఉద్యోగాలు సాధించగలిగారని చెప్పారు. డిగ్రీ పూర్తయిన ప్రతి విద్యార్థి, ఉద్యోగంతో బయటకు వెళ్లేలా చేస్తున్న తమ కృషి ఫలించిందని చెప్పారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్చంద్ వీరితో ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

యూసీసీ చట్టాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నేతలు

తెనాలి: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) చట్టాన్ని ప్రతిఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని, ఈ చట్టం ముస్లింలకే కాకుండా దేశంలో అన్ని వర్గాల ప్రజలకు చేటు కలిగిస్తుందని రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అన్నారు. పట్టణ జామియా మసీదు వద్ద శుక్రవారం నమాజు ప్రార్థనల అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కావాలని కొన్ని నల్లచట్టాలను తీసుకొచ్చి, రాజకీయంగా లబ్ధిని పొందాలని చూస్తోందని ఫరీద్ ఆరోపించారు. ప్రతి రాజకీయపార్టీ ఈ చట్టాన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తిచేశారు. సయ్యద్ షబ్బీర్ మాట్లాడుతూ ఈ చట్టం కేవలం ఒక ముస్లిం వర్గానికి మాత్రమే చెందినది కాదన్నారు. జామియా మసీదు అధ్యక్షుడు షేక్ సుభాని, షేక్ సమద్, షేక్ కాలేషా, షేక్ సత్తార్, షేక్ షబ్బీర్, షేక్ అబ్దుల్ రహమాన్, చెరుకూరి గోపి, ధనాలల రాఘవేంద్రావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా సురేష్చంద్రయాదవ్



ఎమ్మెల్యే శివకుమార్తో సురేష్చంద్ర యాదవ్

తెనాలి: స్థానిక కోర్టు భవన సముదాయంలో నూతనంగా ప్రారంభించిన పోక్సో ప్రత్యేక కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చింకా సురేష్చంద్ర యాదవ్ నియమితులయ్యారు. నియామకపత్రంతో శుక్రవారం గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ను కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో అనేక సంవత్సరాలుగా సేవలను అందిస్తున్న సురేష్చంద్ర యాదవ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నియమితులు కావడం అభినందనీయమన్నారు. పోక్సో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. ఇదే సందర్భంగా స్థానిక న్యాయవాదులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్చంద్రయాదవ్ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపటి నుంచి మహిళలకు ప్రత్యేక యోగ శిక్షణ

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఆదివారం మహిళల ప్రత్యేక యోగ శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని, ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణలో మహిళల కోసం ప్రత్యేక ఆసనాలు, ప్రాణాయామాలు, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు, యోగ భారతి వందనాలు, తదితర అంశాలు నేర్పిస్తామని తెలిపారు. ఎనిమిది నుంచి 80 సంవత్సరాల వయస్సు కలిగిన నడవ కలిగిన ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని కిషోర్ గురూజీ తెలిపారు. 9440712208కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ మండల గ్రామాల్లో విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.అశోక్కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సరఫరా నిలిపివేతను గమనించి అధికారులకు సహకరించాలని డీఈఈ కోరారు.

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులుగా ఈశ్వర్, సుభాష్

తెనాలిఅర్బన్: ఎస్ఎఫ్ఐ తెనాలి అధ్యక్ష కార్యదర్శులుగా ఉదయ్ఈశ్వర్, కూచిపూడి సుభాష్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా అద్దంకి సాత్విక్, పి.అనుదీప్, కె.రవీంద్ర, సహాయ కార్యదర్శులుగా నంబూరి వినయ్, సీహెచ్.నరేంద్ర, కె.నవీన్లు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం టి.మల్లేశ్వరరావు, వైద్యశాఖ సిబ్బంది

అన్నవరపులంక(కొల్లిపర): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని ప్రధానోపాధ్యాయుడు టి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నవరపులంక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిగిరెట్ వద్దు-పౌష్టికాహారం ముద్దు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో 9వ తరగతి విద్యార్థిని జి.దివ్వ ప్రథమ బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవటమే కాకుండా ఇలాంటి వ్యాసరచన పోటీల్లో పాల్గొంటే మేధా శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడండి



బాలాజీరావుపేటలోని ఎంఈ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చూడటంతోపాటు ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాకానుకను అందరూ ఉపయోగించే విధంగా చూడాలని ఎంఈఓలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు సూచించారు. బాలాజీరావుపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, భవిత కేంద్రాన్ని ఎంఈవో-1 లక్ష్మీనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మారీసుపేటలోని ఎన్సీఆర్ స్కూల్కు ఎంఈవో-2 వి.జయంతిబాబు పరిశీలించారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో పనిచేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పాఠశాలలోనే భోజనం చేయాలని సూచించారు. అనంతరం నాడు-నేడు అభివృద్ధి పనులు ఈనెల 31లోగా పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈ నాగమల్లేశ్వరరావు, ఏఈలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జి.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనంతకుమార్, క్లస్టర్ రిసోర్స్పర్సన్లు శ్యామ్బాబు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను గౌరవించడం బాధ్యత

నెహ్రూనగర్: జాతీయ జెండాని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. జిన్నా టవర్ వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన జాతీయ జెండా వర్షంలో తడిచి, రద్దీ కూడలిలోని వాయు కాలుష్యం వలన దుమ్ము పట్టడంపై పలు పత్రికలు, మాజీ సైనికుల, రాజకీయపార్టీల ప్రతినిధుల ఫిర్యాదు మేరకు శుక్రవారం నూతన జెండాను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు జిన్నా టవర్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా దుమ్ము అంటి ఉన్నదని దీనిపై పలువురు ఫిర్యాదు చేశారని, వెంటనే పాత జెండా స్థానంలో నూతన జెండాను శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నగరపాలక సంస్థ ముఖ్య సమాచారం లీక్

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయానికి సంబంధించిన ముఖ్య సమాచారం బయటకు పొక్కడంపై అదనపు కమిషనర్ పెద్ది రోజా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సి డి ఎం ఏ) కార్యాలయం నుంచి నగరపాలక సంస్థకు వచ్చే ప్రధాన అంశాలు, గోప్యంగా ఉంచాల్సిన ముఖ్య సమాచారాలు, ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం చర్యలకు ఉపక్రమించే అంశాలు ఇలా తదితరాలు నగరపాలక సంస్థ టపా సెక్షన్కు వస్తుంటాయి. ఆ సెక్షన్ సిబ్బంది వచ్చిన వివిధ అంశాలను ఉన్నతాధికారులకు పంపుతూ ఉంటారు. అక్కడ నుంచి ఏ సెక్షన్ కి వెళ్లాలో ఆ సెక్షన్ కు సంబంధిత అంశాలను పంపుతూ ఉంటారు. కానీ టపా సెక్షన్ లో పనిచేసే సిబ్బంది సంబంధిత సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించకుండానే బయట ప్రవేట్ వ్యక్తులకు పంపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయని నగరపాలక సంస్థ సిబ్బంది చెప్పుకోవడం గమనార్హం. ఇందులో భాగంగా గురువారం ఉదయం అదనపు కమిషనర్ సెక్షన్కి వెళ్లి టపా సెక్షన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. భవిష్యత్లో ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.